# తేలిపోయింది

## సుధ

శారద మనసెంతో దిగులుగా వుంది. గుండెల్లో సుళ్ళు తిరుగుతున్న బాధ పైకి రావటం లేదు. పెళ్ళికాని ముప్పయి మూడేళ్ళ అమ్మాయి ఒంటరిగా దిగాలుగా కూర్చొని వుందంటే కారణం వేరే ఏముంటుంది? మనసు బాగోక కాసేపు సేద తీర్చుకోవడానికి ఊరికి చివరున్న కాలవగట్టుకి వచ్చింది. ఇంట్లో వారికి తెలీకుండా తెలిస్తే గడపదాట నివ్వరని శారదకు తెలుసు. గుండెల్లో బాధ పైకి తన్నుకు రాసాగింది. శారద కళ్ళంటా రెండు కన్నీటి బొట్లు రాలాయి.

'అన్నయ్య పెళ్లి చెయ్యడు. ఈ ఊళ్ళో వాళ్ళు నన్ను శాంతిగా బ్రతకనీరు. అయినా ఊళ్ళో వాళ్ల ననుకోవటం దేనికి? తనకు మాత్రం పెళ్ళిచేసుకుని హాయిగా కాపురం చెయ్యాలని లేదు' అనుకుంది.

శారదకు గతంలో జరిగిన అవమానాలు, వర్తమానంలో జరుగుచున్న అవహేళనలు గుర్తొచ్చి ఏడుపొచ్చింది. తమ పక్కింటి వనజ పెళ్ళికి ఆమె కళ్ళలో ఎంతో గర్వం కనిపించింది. ఆమెకు ఏడాది తిరక్కుండానే బాబుపుట్టాడు. ఆ బాబుని, భర్తని చూసుకుంటే ఎంతో గర్వం వనజకి. 'తన సంసారం, తన పిల్లలన్న తృప్తికంటే స్త్రీకి ఇంకేం అక్కర్లేదు. పెళ్ళి పిల్లలు లేని జీవితం వేస్ట్' అని తనెదురుగానే నిర్మొహమాటంగా అనేది తనేదో పెళ్ళికి ఇష్టపడనట్లు.

మరోసారి లక్ష్మి వాళ్ళాయనే సినిమాకెళ్తుంటే "లక్ష్మీ! నువ్వు మీ వారు సినిమా కెళ్తున్నారా?" అని ఎంతో ఆనందంగా అడిగితే 'నీ కళ్ళు మా వారి మీద పడ్డాయా" అంది పెడసరంగా. "అంతమాటనకమ్మా. నీ భర్త నాకు తమ్ముడులాంటి వాడు" అంటూ ఏడుస్తూ వెళ్ళిపోయింది.

తనెదురుగానే తమ భర్తలమీద తనేదో కన్నేసినట్టు, తమ సంసారాలు కూల్చేస్తానేమోనని భయపడుతున్నట్టు సూటిపోటీ మాటలు విసురుతుంటే శారద భరించలేకపోతుంది. "మాయకాలం. పెద్ద మనుషులమైన చెల్లాళ్ళకే పెళ్ళిళ్ళు చేసేసారమ్మా మా పెద్దాళ్ళు. నలభై ఏళ్లొస్తున్నా పెళ్ళి పెటాకులేకుండా ఊరిమీదకు వదిలేస్తున్నారు. మా మొగుళ్ళను కాపలా కాసుకోలేక ఛస్తున్నాం" అని శారద ఎదురుగానే అనేసే వారు. కనుచీకటి పడటంతో శారద ఆలోచన్లోంచి తేరుకుని ఇంటికి బయలుదేరింది.

ఇంటి దగ్గర అన్న వదినలు సరసాల్లో మునిగిపోయి వున్నారు. తాము హాయిగా సంసారం చేసి పిల్లల్ని కంటూ ఎదిగి ముదిరిన చెల్లెలుందనే బెంగ లేకుండా ఆనందంగా వున్న భగవాన్‌ని చూస్తుంటే "లోకంలో ఇటువంటి దరిద్రపుగొట్టు అన్నయ్యలు ఎవ్వరికీ వుండకూడదు" అన్పిస్తుంది శారదకు. "పెళ్ళి కావలసిన పిల్లవు, అలా ఊరు పట్టుకుని తిరిగితే రేపెవరైనా పెళ్ళి చేసుకుంటారా" శారదని కసురుకొన్నాడు. "నాకా... పెళ్ళా?... ఈ జన్మలోనేనా?" అంటూ వెళ్ళిపోయింది.

"లక్ష్మికి కూతురు పుట్టిందటండీ" వదిన మాటలకి "ఏడాది తిరక్కుండానే కూతురా! ఘటికుడే" అన్నాడు.

"మరే. మీరు మాత్రం తక్కువేటి?" ముద్దుగా కసిరింది. భగవాన్ ఛాతీ పొంగింది. భార్య చెవిలో గుసగుసగా ఏదో అనటం, ఆవిడ మొహం ఎర్రబడటం గమనించి శారద బాధగా నిట్టూర్చింది.

మర్నాడు – చెఱువులోని నీళ్ళు తెస్తున్నశారద కాళ్ల దగ్గర రాయితో చుట్టిన కాగితం పడింది. దాన్ని తీసి చదివి క్షణంసేపు ఆలోచించింది. ఏదో నిశ్చయించుకున్న దానిలా ఆ రాయి విసిరిన వ్యక్తివేపు చూసింది. ప్రెసిడెంట్‌గారబ్బాయి శేషు. వెకిలి నవ్వు నవ్వుతూ చూస్తున్నాడు. శారద ఇంటి దారిపట్టింది.

రాత్రి పది గంటలకు దొడ్డిదారమ్మట ఊరికి కాస్త దూరంగా వున్న ఒక గొడ్ల చావిడిలోనికి వెళ్ళింది. "రావనుకొన్నాను. వచ్చావా?" అంటూ దగ్గరికొస్తున్న శేషుని "ఒక మాటడగనా?" అంది. "అడుగు.డబ్బు కావాలా?" శేషు మాట శారదకు కొరడా దెబ్బతగిలినంత బాధ కలిగించింది. "నేను డబ్బు కోసం వొళ్ళమ్ముకునే వేశ్యనుకాను. నన్ను పెళ్ళి చేసుకుంటావా?" అంది. శేషు హేళనగా నవ్వాడు. ఆ నవ్వుచూసి వొళ్ళు మండింది శారదకు. "ఏ... ఈ ఒక్కరాత్రి స్వర్గసుఖాలను భరించొచ్చని రాసావు. నన్ను చేసుకుంటే ప్రతి రాత్రి సుఖం ఉంటుంది కదా" అంది. గుటకలు మింగుతూ "పెళ్ళా? నిన్నా? నువ్వు వయస్సులో నా కన్నా పెద్దదానవు. నీతో పెళ్ళేంటి?" అన్నాడు. "మరి పెద్దదాన్నైన నాతో సంబంధం పెట్టుకోవాలని ఎందుకనుకొన్నావు. పెళ్ళి కర్కొస్తున్న పెద్దతనం కామానికడ్డు రావటం లేదా?" అంది. శేషు కాస్త తెగించాడు. "పెళ్ళి పెటాకుల్లేకుండా ఇన్నాళ్ళు ఎవడి దగ్గరికెళ్ళ కుండా పతివ్రతలాగే వున్నావేంటి. ఈ నైట్ సుఖం నేనిస్తానా" అన్నాడు. శారద భయపడలేదు. పక్కనున్న కర్రతీసి "దగ్గర కొచ్చావంటే బుర్రపగులుద్ది జాగ్రత్త" అంటూ వెళ్ళిపోయింది.

ఇంటి కొచ్చాక శారదను ఆలోచనల్లో నిద్రపోనిస్తే కదా. 'శేషూగాడికి లేని వ్యసనం లేదు. తెలిసితెలిసి ఎవ్వరూ వాడికి పిల్లనివ్వరు. అటువంటి వాడిక్కూడా తాను తగదు. ఇక ఈ అవమానాలు సహించలేను. రేపు అన్నయ్యను నిక్కచ్చిగా అడిగేయాలి" అనుకుంది.


మర్నాడు – భోజనాల దగ్గర – "అన్నయ్యా! నాకే రెండో పెళ్ళి వాడ్నయినా చూసి కట్టెయ్యరా. ఊళ్ళోవాళ్ళ మాటలు భరించలేకపోతున్నాను" అని అడుగుతున్న శారదను ప్రపంచంలో ఎనిమిదో వింత చూస్తున్నట్టు చూసింది గిరిజ. ఆడపిల్ల తనకి పెళ్ళి చెయ్యమని అడుగుతున్న స్థితికి తాము దిగజార్చామని అర్ధమవ్వలేదా మూర్ఖురాలికి. భగవాన్ అడగరానిదేదో అడిగినట్టు కోపంగా చూస్తూ "అంత అర్జెంటుగా పెళ్లవసరం ఏమొచ్చింది" వ్యంగ్యంగా అడిగాడు. చెల్లెలితో అన్నగారు మాట్లాడవలసిన పద్ధతి అది కాదని ఆ చెంపా ఈ చెంపా వాయించాలనిపించింది శారదకు. "ఊళ్ళో వాళ్ళ మాటలు భరించలేకపోతున్నాను. పెళ్ళయితే ఈ మాటలైనా తప్పుతాయని" దీనంగా అంది.

"నోర్మూయ్. వెధవాగుడోటి " తీసిపారేసాడు. "ఏమ్మా, ఎంత ఇదైతే మాత్రం అంత బరితెగించి మాట్లాడెయ్యడమేనా?" అంది గిరిజ. శారద ఇంక సహించలేకపోయింది.

"అన్నయ్యా? కోరికలతో దహించుకుపోయే పెళ్ళి చెయ్యమని అడుగుతున్నాను. నా బాధ అర్థంచేసుకునే సంస్కారం మీకు లేనప్పుడు పచ్చిగానే మాట్లాడవలసి వస్తుంది. నేను మనిషిని కానా? నలభయేళ్ళు దాటుతున్న నువ్వు వదిన నా ఎదురుగానే సరసాలాడుకుంటుంటే నాకెంత బాధ కలుగుతుందో మీరెప్పుడైనా ఆలోచించారా... అది మీ ఆనందం చూసి కాదు. నాకా భాగ్యంలేదని, నా కన్నా చిన్నవాళ్ళు తల్లులై పొంగిపోతుంటే నేనెంత కుమిలిపోతున్నానో తెల్సా" అంది. ఆ చెంపా ఈ చెంపా వాయించేసాడు భగవాన్. శారదలో ఆవేశం కట్టలు తెంచుకుంది "ఇంట్లో పెళ్ళామున్నా వాంఛలుతీర్చుకోడానికి బయట ఇద్దర్ని వుంచుకున్నావు. ముదిరిన చెల్లెలుందని కూడా మరచి నీ సరదాలు నువ్వుతీర్చుకుంటున్నావు. నేనుమనిషినని, నాకు కొన్ని కోరికలు ఉంటాయని మర్చిపోయావు. అంతా నా ఖర్మ" ఆవేశం దుఃఖంగా మారి శారద ఇంక మాట్లాడలేకపోయింది.

ఆ రాత్రి పడుకొని ఆలోచించింది తన సమస్యకు పరిష్కారం. తాను సరైన నిర్ణయం తీసుకొన్నానని శారద

'శేషూగాడికి లేని వ్యసనం లేదు. తెలిసి తెలిసి ఎవ్వరూ వాడికి పిల్లనివ్వరు. అటువంటి వాడిక్కూడా తాను తగదు. ఇక ఈ అవమానాలు సహించలేను: రేపు అన్నయ్యను నిక్కచ్చిగా అడిగేయాలి' అనుకుంది.



మనస్సు గట్టిగా హెచ్చరించింది. అర్ధరాత్రి దాటాకా శారద ఇల్లు విడిచి బయటకి నడిచింది. ఊరి వెలుపల ఉన్న రైలు పట్టాల దగ్గర ఆమె నడక ఆగింది. రైలు పట్టాల మీద పడుకుంది. రైలొస్తున్న చప్పుడు వినబడి కళ్ళు గట్టిగా మూసుకుని "భగవంతుడా! నాలాంటి జన్మ మరే స్త్రీకి ఇవ్వొద్దు" శారద చివరిసారిగా అనుకొన్నమాటలవి.

మర్నాడు — ఊరంతా గుప్పుమంది శారద రాత్రి ఎవడితోనో లేచిపోయిందని. ఆ ఎవడు ఎవరో ఈ జనానికి అవసరం లేదు. తీగ కదిలితే నిజానిజాలు బయటపడక మానవు. అప్పుడే జనానికి థ్రిల్ వుండదు. ఎవరికి తోచిన వాళ్ళు వాళ్ళను శారద కంటగట్టి తృప్తిపడ్డారు. నిజం ఈనాడు కాకపోయినా రేపైనా బయటపడక మానదు. ఆ నిజం కంటె ఈ అబద్ధమే జనానికి బాగుంటుంది మరి.

*